సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం ၊ 12 ၊ మార్చి ၊ 2024



టన్ను చీనీ రూ.24 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.13
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.15



న్యూస్‌రీల్

'పురం' మార్కెట్‌కు 40 వేల క్వింటాళ్ల చింతపండు



హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ చింతపండు కొనుగోళ్లతో కళకళలాడుతోంది. సోమవారం ఏకంగా 40,000 క్వింటాళ్ల చింతపండు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8,050, సగటున రూ.13 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.9,100, కనిష్టంగా రూ.4,100, సగటున రూ.6 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

నేడు బుక్కపట్నంలో జాబ్‌మేళా



పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మంగళవారం బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి పది, ఇంటర్ డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసినవారు అర్హులు. ఉద్యోగాలకు ఎంపికైన వారు జిల్లాతో పాటు హైదరాబాద్, తిరుపతి, బెంగళూరు తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. వేతనం రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయని, హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7981541994 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇంటర్ పరీక్షకు 204 మంది గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్ వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్–2బీ, జువాలజీ–2, హిస్టరీ–2 పరీక్షలు జరిగాయి. జిల్లాలోని 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 204 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ విద్య అధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్‌కు సంబంధించి 5,974 మందికి గాను 5,731 మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 999 మంది విద్యార్థులకు గాను 938 మంది హాజరయ్యారని తెలిపారు.

'స్పందన'పై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే 'స్పందన' కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ఆయన, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 165 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ...ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఇందుకోసం సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. గడువులోపు సమస్య పరిష్కరించి అర్జీదారుల్లో నమ్మకాన్ని కలిగించాలన్నారు.

ప్రాధాన్యతా భవనాలను ప్రారంభించాలి
జిల్లాలో 92 ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని ఈనెల 13వ తేదీలోపు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి పండుగ వాతావరణంలో ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లెయిమ్‌లను మంగళవారం లోపు పరిష్కరించాలన్నారు. త్వరలోనే ఎన్నికల కోడ్ రానుందని, ప్రతి ఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలన్నారు. రాజకీయ నేపథ్యం ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలను కోడ్ వచ్చిన 24 గంటల్లోపు తొలగించాలన్నారు. అలాగే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలన్నారు.

పేదలకు ఆరోగ్య భాగ్యం



- ఈ చిత్రంలోని వ్యక్తి పేరు లతీఫ్ ఖాన్. కొత్తచెరువులోని మసీదు ప్రాంతంలో మిక్చర్ బండి నడుపుతూ జీవనం సాగించేవాడు. 2019లో అనారోగ్యానికి గురై వైద్యుని వద్దకు వెళ్లగా, కిడ్నీలు పాడైనట్లు నిర్ధారించారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని లతీఫ్‌ఖాన్ గుండె ఆగినంత పనైంది. తెలిసిన వారు చెబితే స్థానిక ఆరోగ్యశ్రీ కార్యకర్తను సంప్రదించాడు. అప్పటి నుంచి ఆయనకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ప్రతినెలా రూ.10 వేలు అందిస్తోంది. అలాగే ఉచితంగా డయాలసిస్ చేయిస్తోంది. ఏ దిక్కులేని తనకు వైఎస్ జగన్ రెడ్డి పెద్ద అండగా నిలిచారని, ఆయనే లేకపోతే తాను, తన కుటుంబం ఏమైపోయేవారమోనని లతీఫ్‌ఖాన్ చెబుతున్నాడు. తనలాంటి ఎందరికో అండగా నిలిచిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని లతీఫ్ ఖాన్ చెబుతున్నాడు.



- ఇతని పేరు రమేష్. పుట్టపర్తి రూరల్ మండలం వెంగళమ్మ చెరువుకు చెందిన ఇతను ఎంబీఏ పూర్తి చేశాడు. తల్లిదండ్రులు గ్రామంలోనే కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. 2019లో రమేష్‌కు తీవ్రమైన జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా, కిడ్నీలు పాడైనట్లు వైద్యులు తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ చేస్తే తప్ప ఉపయోగం లేదని, అందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని తేల్చి చెప్పారు. దీంతో రమేష్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. స్నేహితుల సలహాతో స్థానికంగా ఉన్న ఆరోగ్య మిత్రను కలవడంతో రమేష్‌కు స్థానికంగా ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. అలాగే ప్రతి నెలా రూ.10 వేలు అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితులు సహకరించడంతో ఆరు నెలల క్రితం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో రమేష్‌కు ఉచితంగానే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. 'ఆరోగ్యశ్రీ' తనను ఆదుకుందని, తనకు జీవితం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనని అంటున్నాడు రమేష్.

... ఇలా ఎందరో పేదల జీవితాల్లో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ వెలుగులు నింపింది. ఏ ఆధారం లేని వారికి ఊపిరి పోసి ఆయా కుటుంబాలకు భరోసా ఇచ్చింది.



- 'ఆరోగ్య శ్రీ'తో లక్షలాది కుటుంబాల్లో వెలుగులు
- పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన జగన్ సర్కార్
- బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న నిరుపేదలు

ప్రశాంతి నిలయం: రాష్ట్రంలోని నిరుపేదలకు 'వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' వరంలా మారింది. ఓ జబ్బుకైనా ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ భరోసా కల్పిస్తోంది. దివంగత నేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని గత టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయగా, వైద్య సేవలు అందక నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కానీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆరోగ్యశ్రీ వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. ప్రొసీజర్లను పెంచడంతో పాటు పరిమితిని కూడా రూ.2 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకూ పెంచారు. అలాగే మన రాష్ట్రంలోనే కాకుండా మహానగరాలైన బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలలోని 130 కార్పొరేట్ ఆస్పత్రుల్లో 716 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు కూడా మన రాష్ట్ర ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా అందేలా చర్యలు తీసుకున్నారు.

జిల్లాలో రూ.302 కోట్ల వ్యయం
జిల్లా వేలాది కుటుంబాలు ఆరోగ్య శ్రీ ద్వారా లబ్ధి పొందాయి. 2019 నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ ద్వారా 1,52,868 మందికి ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రుల ద్వారా వివిధ రకాల శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించారు. వీటికోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ.302 కోట్లు ఖర్చు చేసింది.

వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.40.65 కోట్లు
వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరింత మెరుగులుదిద్దే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీ కారం చుట్టారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పేరుతో శస్త్రచికిత్సల అనంతరం రోగి కోలుకునే వరకు ప్రభుత్వమే వారికి భృతిని కల్పిస్తోంది. విశ్రాంతి కాలంలో రోగికి జరిగిన చికిత్సల మేరకు రోజుకు రూ.225 చొప్పున నెలకు 5 వేలు అందజేస్తోంది. ఈ పథకం ద్వారా 2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని 78,552 మందికి రూ.40.65 కోట్లు అందాయి.

ప్రొసీజర్ల పెంపు.. రోగులకు వరం
రాష్ట్రంలో 2019 వరకు ఆరోగ్యశ్రీ ద్వారా 1,052 ప్రొసీజర్లకు మాత్రమే సేవలు అందించేవారు. దీని వల్ల కొన్ని వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేందుకు వీలయ్యేది కాదు. దీంతో ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధి సోకితే పూర్తి మొత్తం చెల్లించి వైద్యం పొందాల్సిన పరిస్థితి ఉండేది. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ఏ వ్యాధి సోకినా ఆరోగ్యశ్రీలో చికిత్స అందేలా ప్రొసీజర్లను 3,257కు పెంచారు. దేశంలో ఏక్కడా లేని విధంగా ప్రజలకు ఆరోగ్య భరోసాను కల్పిస్తూ కోవిడ్, డెంగీ వంటి రోగాలను సైతం ఆరోగ్యశ్రీలో చేర్చి పేదల ఆరోగ్యం పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

అందరికీ ఆరోగ్యశ్రీ సేవలు
గతంలో తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఆరోగ్యశ్రీ పథకం వర్తించేది. అయితే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే రూ.5 లక్షల ఆదాయం ఉన్న వారికీ ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకూ జిల్లాలోని 5,46,836 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. అలాగే పరిమితిని కూడా రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచి ఖర్చుతో పని లేకుండా ఏ జబ్బుకైనా ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు.

1,52,868
ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న జిల్లా వాసులు

రూ. 302 కోట్లు
శస్త్ర చికిత్సలకు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం

78,552
వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధి పొందిన వారు

రూ. 40.65 కోట్లు
వైఎస్సార్ ఆసరా ద్వారా కలిగిన లబ్ధి

నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి
జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడు రూ.25 లక్షల వరకు పరిమితి లేకుండా వైద్యం అందేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రోగి శస్త్ర చికిత్సల అనంతరం వారి భృతి కోసం రోజుకు రూ.225 చొప్పున నెలకు రూ.5 వేల వరకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా అందిస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలందరికీ ఆరోగ్యశ్రీ పథకం ఎలా వినియోగించుకోవాలి.. నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలనూ తెలియజేస్తున్నాం.
– డాక్టర్ శ్రీ దేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

'సిద్ధం' సభలతో ప్రతిపక్షాలకు వణుకు

- అందుకే అసత్య ప్రచారాలతో శునకానందం
- మంత్రి ఉషశ్రీచరణ్ మండిపాటు



మాట్లాడుతున్న మంత్రి ఉష శ్రీచరణ్

సోమందేపల్లి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సిద్ధం' సభలకు జనం లక్షలాదిగా స్వచ్ఛందంగా తరలిరావడం చూసి ప్రతిపక్ష పార్టీలకు వణుకు పుట్టిందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పెనుకొండ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. సోమవారం ఆమె సోమందేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం మేదరమెట్లలో జరిగిన 'సిద్ధం' సభకు 15 లక్షల మందికిపైగా జనం వస్తే.. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు నిద్ర కరువైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి.. ప్రజలు స్వచ్ఛందంగా 'సిద్ధం' సభలకు తరలి వస్తుంటే జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు పచ్చమీడియా ద్వారా పిచ్చి రాతలు రాస్తూ అసత్య ప్రచారాలతో శునకానందం పొందుతున్నారన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి దొడ్డిదారిన చంద్రబాబు సీఎం అయితే.. ఆయన పుత్రరత్నం లోకేష్.. తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని మంత్రి అయ్యాడన్నారు. వీళ్లిద్దరికీ ప్రజలు పదవులు ఇవ్వలేదన్నారు. వెన్నుపోటు రాజకీయాలతో అధికారంలోకి వచ్చారన్నారు. ఇలాంటి వారు ప్రజాభిమానం మెండుగా ఉన్న జగన్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న పచ్చ నేతలు, మీడియా కూడా వాస్తవాలు గ్రహించాలన్నారు. తాను కళ్యాణదుర్గంలో ఇళ్లు కట్టుకునేందుకు నిబంధన మేరకు మున్సిపల్ అధికారుల అనుమతి కోసం దరఖాస్తు చేశానని, అప్పటి టీడీపీ కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్, అధికారులు తన ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని తెలిపారు. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చిన తనపై ఏది పడితే అది మాట్లాడితే లోకేష్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా రానున్న ఎన్నికల్లో జగనన్నపై ప్రజలకున్న అభిమానం ముందు నిలవలేవని, ఆ పార్టీలకు ఒక్క సీటు కూడా రాదన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజాభివృద్ధి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: మహిళాభివృద్ధితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ అన్నారు. సోమవారం పుట్టపర్తి డీఆర్‌డీఏ కార్యాలయంలో శ్రీసత్యసాయి జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిద్దగంగమ్మ, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి పద్మమ్మ, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తదితరులు పాల్గొన్నారు. ముందుగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రతిభ కనబరిచిన సోమందేపల్లి, కదిరి, బత్తలపల్లి మండల సమాఖ్యలను మెమెంటోలు అందజేశారు. అనంతరం ఆర్డీఓ భాగ్యరేఖ మాట్లాడుతూ...మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలని, ఇందుకు కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు.

సవిత కోసం పని చేయలేం

- తేల్చిచెప్పిన బీకే అనుచర వర్గం

పెనుకొండ: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విజయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ పని చేయలేమని, అవసరమైతే రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటామని పెనుకొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి వర్గీయులు తేల్చి చెప్పారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బీకే తన స్వగృహంలో పార్టీ పరిశీలకుడు డాక్టర్ నరసింహారావు సమక్షంలో తన వర్గీయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిష్టానం ఆదేశాల మేరకు సవిత విజయానికి కృషి చేద్దామని కోరారు. తనకు హిందూపురం ఎంపీ టికెట్ రాని పక్షంలో అనంతపురం వెళతానని తెలపగా, ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ తాము సవితకు వ్యతిరేకంగానే పనిచేశామని, ఇప్పుడు కలిసి పని చేయమంటే కుదరదన్నారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటామన్నారు. అలాగే హిందూపురం ఎంపీ స్థానం దక్కకపోతే ఆలోచించి నిర్ణయం తీసుకుందామన్నారు. సవిత విషయంలో బీకే ఎంత వారించినా ఆయన వర్గీయులు ఒప్పుకోలేదు. ఒక దశలో బీకేపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారికి సమాధానం చెప్పలేని బీకే... మరో రెండు రోజులు వేచి చూద్దామని, న్యాయమో, అన్యాయమో తేలిపోతుందన్నారు. ఈ సమావేశంలో పెనుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీకే వర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ఆగ్రహంతో కేకలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీకే వర్గీయులు

వేరుశనగ రైతాంగాన్ని ఆదుకుంటాం



వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ధర్మవరంలో రూ.77.47 కోట్లతో వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్
- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: వేరుశనగ రైతులను ఆదుకునేందుకు స్థానికంగానే వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గరుడంపల్లి వద్ద 11 ఎకరాల్లో రూ.77.47 కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్‌కు ఎమ్మెల్యే కేతిరెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేరుశనగ పండించే రైతులను దృష్టిలో ఉంచుకొని రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రభుత్వం ఈ ప్రాంతంలో వేరుశనగ యూనిట్‌ను నెలకొల్పుతోందన్నారు. వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా చిక్కీ, వంట నూనె, వేరుశనగ చెక్క తదితర వాటిని తయారు చేస్తారన్నారు. దీనివల్ల రైతులకు ఎప్పుడైనా గిట్టుబాటు ధర దక్కుతుందన్నారు. ఒక్కో పార్లమెంట్ పరిధిలో ఆయా ప్రాంతాల్లో పండే పంటల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా 26 ప్రాసెసింగ్ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందుకోసం రూ.3,600 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా ఈ ప్రాంతంలోని రైతులకు మేలు జరగడంతో పాటు 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఏడాది లోపు ఈ యూనిట్‌ను నిర్మించే విధంగా కాంట్రాక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ హెచ్‌ఓ అజయ్‌కుమార్, డీఈ శ్రీనివాసులు, ఎండీ విక్రమ్, చంద్రశేఖర్, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి, వైస్ ఎంపీపీ పాటిల్ చెన్నకృష్ణారెడ్డి, ధర్మవరం మండల ఇన్‌చార్జ్ చిగిచెర్ల శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు బాబయ్య, నాగానందరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కనిపించిన నెలవంక

- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

పుట్టపర్తి టౌన్/బత్తలపల్లి: దివ్యఖురాన్ అవతరించిన రంజాన్ మాసాన్ని సూచిస్తూ సోమవారం నెలవంక కనిపించింది. దీంతో మంగళవారం నుంచి ఉపవాస దీక్షలకు ముస్లింలు సమాయత్తమయ్యారు. సోమవారమే ఇషా నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం (ప్రత్యేక తరావీ నమాజ్) ప్రారంభించారు.

నెలరోజులు కఠోర దీక్షలు
ముస్లింలు రంజాన్ మాసంలో ప్రత్యేక తరావీ చేస్తూ కఠోర దీక్షలు చేపడతారు. ఉపవాసాలు పాటిస్తూ అల్లాహ్‌పై విధేయతను ప్రకటిస్తూ, కట్టుబాట్లను ఆచరిస్తూ క్రమశిక్షణ జీవితాన్ని గడుపుతారు. రోజూ ఉషోదయానికి ముందే ఉపవాసాలు ప్రారంభిస్తారు. దీన్ని సహరీ అంటారు. సూర్యాస్తమయం కాగానే అల్పాహారంతో దీక్ష విరమిస్తారు. రోజులో 5 సార్లు నమాజును (ఉదయం ఫజర్, మధ్యాహ్నం జోహర్, సాయంత్రం 5 గంటలకు అసర్, 6.30 గంటలకు మగ్‌రిబ్, రాత్రి 8.30 గంటలకు ఇషా) చేస్తారు. ఇందులో తరావీహ్ నమాజ్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ఇషా నమాజ్ తర్వాత ఎంతో నిష్టతో మరో 20 తరావీహ్ నమాజ్ చేస్తారు. రోజా పాటించే వారు మనసును భగవంతునిపై లగ్నం చేసి చెడు ఆలోచనలకు దూరంగా ఉంటారు. సాధ్యమైనంత ఎక్కువ సమయం మసీదుల్లో, దైవ ధ్యానంలో గడుపుతారు. రోజుకు కనీసం 14 గంటల పాటు ఉపవాస దీక్ష ఉంటుంది.

జకాత్‌కు ప్రాముఖ్యత
రంజాన్‌లో చేపట్టే ఏహ్‌తేకాఫ్, జకాత్, ఫిత్రా, ఇఫ్తార్, తరావీహ్ నమాజ్‌తో ఏడాది అంతా శుభం కలుగుతుందని ముస్లింల విశ్వాసం. ఇక.. ఈనెలలో జకాత్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. జకాత్ అంటే దానం చేయడం. అనాథలు, వృద్ధులకు ప్రతి ముస్లిం తనకున్న నికర ఆదాయంలో నూటికి రెండున్నర వంతున ఇవ్వాలని ఖురాన్ చెబుతోంది. పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన సతామిని ఉపవాసాలు ప్రారంభమైన 27వ రోజున జరుపుకుంటారు. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేలా చేయడానికి ఖురాన్ ఉపవాస దీక్షలను నిర్దేశించిందని మత పెద్దలు తెలియజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు
రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లిం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. రోజా పాటించే వారంతా గంట ముందుగానే ఇంటికి వెళ్లేందుకు అనుమతులిచ్చింది.



పుట్టపర్తిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



విద్యుత్ వెలుగుల్లో అనంతపురంలోని ఈద్గా మసీదు

ఎంతో పవిత్రమైంది



రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది. ఈనెల మెత్తం దైవ ప్రార్థనలు చేసి దాన ధర్మాలు చేయాలి. ఉపవాస దీక్షలు తప్పకుండా పాటించాలి. తద్వారా పుణ్యఫలం, అల్లామ్ కృప పొందవచ్చు. రంజాన్ చివరి 10 రోజుల్లో ఐదు తాక్‌రాత్‌లు బాగా వస్తాయి. అన్ని రాత్రులు దువా చేయాలి. తద్వారా అత్యధిత పుణ్యఫలం దక్కుతుంది.
– జాకీర్ ముక్తాసాబ్, ముతవల్లి, పుట్టపర్తి

సర్వమానవాళి కోసం ప్రార్థిస్తాం



ఈ నెల రోజులు పవిత్ర హృదయంతో నియమ, నిష్టలతో దీక్షలు చేస్తాం. సమాజంలో అందరితో స్నేహపూర్వకంగా, కలిసి మెలసి మెలగాలని ఖురాన్ తెలియజేస్తుంది. ఖురాన్ పఠనం ద్వారా మా కుటుంబాలతో పాటు సర్వ మానవాళి సుఖ శాంతులతో జీవించాలని ప్రార్థిస్తాం.
–షావలివుల్లా, ఇమామ్, మదీనా మసీదు, బత్తలపల్లి

క్లుప్తంగా

అర్జీలు వెంటనే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రజలు 'స్పందన'లో సమర్పించే అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్ అధికారులను ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'స్పందన'లో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై 24 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విని పరిష్కారం కోసం ఆయా స్టేషన్ల అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాస్‌రావ్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఎంఎస్ఎంఈల ర్యాంప్ సర్వే వేగవంతం

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)పై చేపట్టిన ర్యాంప్ సర్వేను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు కార్యదర్శులకు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు ఆదేశించారు. సర్వే పూర్తయిన వెంటనే వాణిజ్య రంగాల్లోని అన్ని పరిశ్రమలను డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. పోర్టల్‌కు అనుసంధానమైతే పరిశ్రమలలో ఉత్పత్తి అయ్యే వస్తువులను ఎగుమతులు చేసుకునేందుకు అవకాశం మెండుగా ఉంటుందన్నారు. దీంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు బ్యాంక్ రుణ సదుపాయాలు సులభతరం అవుతాయన్నారు. ర్యాంప్ సర్వేకు పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

గడ్డి వామి దగ్ధం



కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని సైదాపురంలో రైతు శ్రీనివాసులుకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు... సోమవారం కొందరు యువకులు టపాసులు పేలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరి సమీపంలోనే ఉన్న శ్రీనివాసులుకు చెందిన వరిగడ్డివామిపై పడ్డాయి. నిమిషాల్లోనే గడ్డి వామి అంటుకుంది. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. అయితే ఫైరింజన్ వచ్చేలోపు పూర్తిగా కాలిపోయింది. లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. రైతును ఆదుకోవాలని కౌన్సిలర్ మురళి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఆంజనేయులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

'అనంత' హాకీ జట్టుకు మూడో స్థానం

అనంతపురం: ప్రకాశం జిల్లా మైనంపాడులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ 14వ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో అనంతపురం హాకీ జట్టుకు మూడో స్థానం దక్కింది. అనంతపురం జట్టుకు జట్టుకు కోచ్‌గా ఎస్.అనిల్ కుమార్, మేనేజర్‌గా వెంకటేశ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా హాకీ జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వం.. సిడిమాను ఉత్సవం



సిడిమాను ఉత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

అమరాపురం: ప్రసిద్ధ హేమావతి సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం సిడిమాను ఉత్సవం ఘనంగా జరిగింది. సాయంకాలం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళా తాళాలతో దేవాలయ ఆవరణలోని కుడి వైపు రాజకట్ట వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన సిడిమానుకు పూజలు చేసి అనంతరం భక్తుల పేర్లు చదువుతూ వారిని సిడిమాను ఎక్కించి మూడు సార్లు తిప్పారు. మధ్యలో దూలం, అడ్డంగా ఓ దూలం ఏర్పాటు చేసి తిప్పారు. ఇలా సిడి ఆడడం వలన వివాహం కాని వారికి కల్యాణయోగం, పిల్లలు లేని వారికి సంతానభాగ్యం, దీర్ఘకాలిక రోగాలు నయం కావడం, తదితర ఫలితాలు లభిస్తాయని ఈ ప్రాంత వాసుల నమ్మకం. చుట్టుపక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ముఖానికి గంధం రాసుకుని వచ్చి స్వామిని దర్శించుకున్న అనంతరం సిడి ఆడుతారు. భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ రాజకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ జనార్దన నాయుడు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి దంపతులతో పాటు రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ గగన తదితరులు సిడిమాను ఉత్సవంలో పాల్గొన్నారు.

నేడు చిన్న రథోత్సవం

సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం చిన్న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నరసింహమూర్తి తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

తలుపుల/ నల్లచెరువు: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. తలుపుల మండలం ఓదులపల్లికి వెంగముని (49) కొంతకాలంగా టీబీ, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన వెంగముని ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొంతు, పొట్ట కోసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే అతడిని 108లో పులివెందుల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కడపకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సలు పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇతడికి భార్య ఉంది. అన్న కుమారుడు రామనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ గురప్ప తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడు..

కదిరిలోని గాంధీ నగర్‌కు చెందిన పఠాన్ హైదర్ వలి (62) అనే తమలపాకుల వ్యాపారి సోమవారం సాయంత్రం నల్లచెరువు మండలం యర్రబల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్యంతో విసిగిపోయి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ రహీం కేసు నమోదు చేశారు.

మహిళ గొంతు కోసి నగదు, చైను అపహరణ



బాధితురాలు అమృత

ధర్మవరం అర్బన్: చిల్లరదుకాణంలోకి చొరబడిన దుండగులు మహిళ గొంతు కోసి నగదుతో ఉడాయించారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన మేరకు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన అమృత అనే మహిళ ఇంటి వద్ద చిల్లర దుకాణం పెట్టుకుని జీవిస్తోంది. సోమవారం సాయంత్రం ముగ్గురు దుండగులు దుకాణంలోకి చొరబడి బ్లేడుతో మహిళ గొంతుకోసి.. మెడలోని బంగారు చైనుతో పాటు దుకాణంలో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు గమనించి అమృతను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని, ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో కింద పడి చిన్నారి మృతి



మృతి చెందిన షాహిదా

బత్తలపల్లి: డ్రైవర్ గమనించకుండా ఆటోను ముందుకు పోనివ్వడంతో చక్రాలకిందపడి చిన్నారి మృతి చెందింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బత్తలపల్లిలోని బృందావన కాలనీకి చెందిన బాషా, ఫాతిమా దంపతులు. వీరికి ఒక కుమారుడు, ఏడుగురు కుమార్తెలు సంతానం. సోమవారం వీరి ఇంటి వద్దకు ఫిల్టర్ నీళ్ల ఆటో వచ్చింది. అక్కడ స్థానికులకు నీళ్లు వదిలిన అనంతరం డ్రైవర్ ఆటోను ముందుకు తీసుకెళ్లేందుకు సమాయత్తమయ్యాడు. అయితే అప్పటికే చక్రాల వద్ద బాషా, ఫాతిమా దంపతుల చిన్న కుమార్తె షాహిదా (2) చేరుకుని ఉంది. దీన్ని గమనించకుండా డ్రైవర్ ఆటోను ముందుకు పోనివ్వడంతో చక్రాల కిందపడి షాహిదా మృతి చెందింది. కొంతసేపటి తర్వాత బయటకు వచ్చిన ఫాతిమాకు విగతజీవిగా పడి ఉన్న కుమార్తె కనిపించడంతో బోరున విలపించింది. ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి తమ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి, కొడేకండ్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ప్రజలకు మంచి చేస్తే చంపుతామంటున్నారు

- టీడీపీ అరాచకాలకు పరాకాష్ట ఇది
- దుర్మార్గులకు ప్రజలే బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: 'ఎవరైనా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తాం, అభివృద్ధి చేస్తాం అని చెబుతారు. కానీ టీడీపీ నాయకులు మాత్రం తాము అధికారంలోకి వస్తే వెంటాడి చంపుతామని చెబుతున్నారు. ఎమ్మెల్యే అయినా నన్నే నరుకుతాం అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరులో 'వైఎస్సార్ చేయూత' మెగా చెక్కు, మహిళలకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఫ్యాక్షన్ కు మళ్లీ ఆజ్యం పోస్తున్నారన్నారు. ఓ టీడీపీ నాయకుడు ఏకంగా తననే అసభ్య పదజాలంతో బెదిరిస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడన్నారు. మా చంద్రబాబు నాయుడు గెలిచాక వెంటాడి తనను, బండి రవిని చంపుతామంటూ బెదిరించారంటే వారు ఎంతటి దుర్మార్గులో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇటీవల గీతాంజలి అనే మహిళ తనకు ప్రభుత్వం స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేసిందని ఆనందం వ్యక్తం చేస్తే, జీర్ణించుకోని టీడీపీ, జనసేన సోషల్ మీడియా నాయకులు ఆమెపై ట్రోల్స్ చేయడంతో అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారికి మనం ఓటు వేద్దామా అంటూ ప్రజలను ప్రశ్నించారు.

పరిటాల సునీత చేయని అభివృద్ధి చేసి చూపా

ఎన్నడూ లేని విధంగా రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సొంత డబ్బుతో అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి మహిళలకు అంకితం చేశానన్నారు. పేదలకు 17 వేల ఇళ్లు మంజూరు చేయించడంతో పాటు రైతులకు ఉచితంగా బోర్లు వేయించానన్నారు. పదేళ్లు మంత్రిగా ఉన్న పరిటాల సునీత చేయలేని సంక్షేమాభివృద్ధి చేసి చూపించామన్నారు. ఎమ్మెల్యే అయిన ఏడాదికే పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చామన్నారు. రూ.154 కోట్లతో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేశామన్నారు. రామగిరి మండలానికి రూ.1,500 కోట్లతో 300 మెగా వాట్ల సోలార్ హైబ్రిడ్ పవర్ ప్లాంట్ తీసుకొచ్చామన్నారు. నియోజకవర్గంలో మరో రూ.5 వేల కోట్లతో 1,050 మెగా వాట్ల సోలార్ ఉత్పత్తి కేంద్రం తెచ్చుకున్నామన్నారు. ఇవన్నీ చేసినందుకు నన్ను చంపుతారా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 2,06,030 మంది పిల్లలకు బాలల బీమా కింద ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో రూ.1.15 లక్షలు చెల్లించారు. ప్రమాదవశాత్తు విద్యార్థి మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.25 వేలు అందుతాయని తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి
- సరిహద్దులోని కర్ణాటక కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా అంతర్రాష్ట్ర అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి కోరారు. సోమవారం వారు కర్ణాటక సరిహద్దు జిల్లాలైన తుమకూరు, చిక్‌బళ్లాపూర్, చిత్రదుర్గ కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పరస్పర సహకారం అవసరమన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాల్సి ఉంటుందన్నారు. మద్యం, నగదు, ఆయుధాలు, మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణాను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ..ఇరు రాష్ట్రాల పోలీస్ అధికారులు సహకారాలు ఇచ్చి పుచ్చుకోవాలన్నారు. ఇరు రాష్ట్రాల నుంచి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సకాలంలో సమాచారం అందేలా చూడాలన్నారు. చెక్ పోస్టుల్లో వాహన తనిఖీలను పగడ్బందీగా చేపట్టి వస్తువులను సీజ్ చేయాల్సిన సమయంలో తీసుకోవాల్సిన నిబంధనలు, విధి విధానాలపై క్షుణ్ణంగా చర్చించారు. వీసీలో జేసీ అభిషేక్‌కుమార్, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణ, సెబ్ డీఎస్పీ సుబ్రమణ్యం, డీఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేతతో సహా నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు

గోరంట్ల: చలమయ్యగారిపల్లి టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డితో పాటు కాంగారెడ్డిపల్లికి చెందిన నరసింహప్ప, వెంకటేశు, శ్రీనివాసులుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు వివరాలను సీఐ సుబ్బరాయుడు సోమవారం మీడియాకు వెల్లడించారు. గౌనివారిపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 109-3లోని 4.45 ఎకరాల భూమిని గోరంట్లకు చెందిన సరోజాబాయి అనే మహిళకు రామచంద్రారెడ్డి మధ్యవర్తిత్వం నెరపి కాంగారెడ్డిపల్లికి చెందిన నరసింహప్ప, వెంకటేశు, శ్రీనివాసులు అనే వ్యక్తుల ద్వారా ఇటీవల పెండింగ్ రిజిస్ట్రేషన్ చేయించారు. సరోజాబాయి నుంచి రూ.12,60,000 నగదును వారికి ఇప్పించారు. నిరక్షరాస్యురాలైన సరోజాబాయి ఇటీవల తాను కొనుగోలు చేసిన భూమికి సంబంధించి ఆన్‌లైన్ 1బీ పత్రం పొందడానికి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసింది. అయితే సదరు భూమి 2013లో ఓలివర్ కంపెనీకి విక్రయించినట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలింది. దీంతో సరోజాబాయికి ఆన్‌లైన్ 1బీ రాలేదు. మోసం చేశారని గ్రహించి, తమతో తీసుకున్న డబ్బులు వాపస్ ఇవ్వాలని సరోజాబాయి, ఆమె భర్త, బంధువులు.. రామచంద్రారెడ్డితో పాటు నరసింహప్ప, వెంకటేశు, శ్రీనివాసులును కోరారు. దీనికి వారు ఆగ్రహిస్తూ కులం పేరుతో దూషించడంతో పాటు డబ్బు అడిగితే చంపుతామని బెదిరించారు. సరోజాబాయి ఫిర్యాదు మేరకు రామచంద్రారెడ్డితో పాటు పైముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నేటి నుంచి దాదులూరు పోతలయ్య పరుష



దాదులూరు పోతలయ్యస్వామి ఆలయ గోపురాలు

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి జాతర వచ్చేసింది. పోతలయ్య, చెన్నకేశవస్వామి రూపాల్లో శివ, నారాయణ ఆలయాలు కొలువుదీరిన ఈ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి చెందింది. పోతలయ్యస్వామి జాతర మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని ఆలయ ధర్మకర్త రామలింగారెడ్డి తెలిపారు. ఇందులో తొలిరోజు జరిగే యలవగంప ఊరేగింపుతో జాతర ప్రారంభమవుతుందన్నారు. రామగిరి మండలం గంతిమర్రి నుంచి ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు ద్వారా పోతలయ్యస్వామి కాపులు స్వామి వారి ఆభరణాలను బుట్టలో తీసుకొచ్చి అలంకరణ చేస్తారు. రెండో రోజు బుధవారం పోతలయ్య, చెన్నేకేశవ స్వాములకు జ్యోతుల మహోత్సవం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, భక్తులు పలహారపు బండ్లతో ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మూడో రోజు గురువారం వేకువజామునే తొమ్మిది మంది పోతురాజుల చేత స్వామి వారికి మేక పిల్లలను బలి ఇచ్చే గావుల మహోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు.

అసభ్యకర వ్యాఖ్యలు చేసిన యువకుడిపై కేసు

కనగానపల్లి: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన యువకునిపై కేసు నమోదు చేసినట్లు కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. కోనాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త వరేష్ ఎమ్మెల్యేను అసభ్యకరంగా దూషించడంతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశాడు. వీటిని వీడియో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ప్రజాప్రతినిధిని దూషించటంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా మాట్లాడిన వరేష్‌పై 153- ఏ, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగేలా ఎవరు ప్రవర్తించినా చర్యలు తీసుకొంటామని ఎస్ఐ హెచ్చరించారు.


మహిళా సంఘాలకు లక్‌పతి దీదీ రుణం



మహిళా సంఘాలకు మెగా చెక్కు అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

పుట్టపర్తి అర్బన్: దేశ వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులను లక్షాధికారులను చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ లక్‌పతి దీదీ కార్యక్రమం అమలు చేస్తున్నారు. సోమవారం ఢిల్లీ నుంచి వర్చువల్ ద్వారా పలు రాష్ట్రాల మహిళలతో సంభాషించారు. పుట్టపర్తిలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మడకశిర మండలానికి చెందిన అనురాధతో ప్రధాని మాట్లాడారు. సమావేశంలో జిల్లాలోని 32 మండలాలకు చెందిన మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. మొదట 20 మంది లక్‌పతి దీదీలను ఘనంగా సన్మానించారు. అనంతరం 1,341 స్వయం సహాయక సంఘాల మహిళలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు గాను సుమారు రూ.109.91 కోట్ల మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎంలు రామమోహన్, రామిరెడ్డి, రమణప్ప, అడ్మిన్ అసిస్టెంట్ గోపాల్, రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



శివపార్వతులకు వసంతోత్సవం చేస్తున్న వేదపండితులు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిసాయి. ఉదయం అభిషేకార్చనలతో పాటు శివపార్వతుల వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. నాట్యమంటపంలో శివపార్వతులను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. వేదపండితులు హోమాలను నిర్వహించి గ్రామానికి, ప్రజలకు మంచి జరగాలని దేవున్ని ప్రార్థించారు. ఆలయంలో ధ్వజారోహణ, సాయంత్రం శయనోత్సవం తదితర కార్యక్రమాలతో ముగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహమూర్తి, సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జైకిషన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.